క్లుప్తంగా

పెరటికోళ్ల పెంపకంతో ప్రయోజనం



పెరటకోళ్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

డెంకాడ: పెరటకోళ్ల పెంపకంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం విజయలక్ష్మి అన్నారు. మండలంలోని చొల్లంగిపేటలో పొదుపు సంఘాల మహిళలకు పెరటకోళ్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఒక్కో లబ్ధిదారుకి 11 కోళ్లను అందజేసినట్లు చెప్పారు. గ్రామానికి చెందిన 50 మందికి కోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చొల్లంగిపేట, డి.కొల్లాం సర్పంచ్‌లు కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు తొత్తడి శ్రీను, దాట్ల సత్యనారాయణరాజు, సీసీలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ కరెన్సీతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం



మాట్లాడుతున్న ఎస్‌బీఐ లెర్నింగ్ సెంటర్ చీఫ్ మేనేజర్ సీహెచ్ సూర్యప్రకాష్

డెంకాడ: డిజిటల్ కరెన్సీతో ఆర్థిక వ్యవస్థకు మరింత బలోపేతమవుతుందని ఎస్‌బీఐ లెర్నింగ్ సెంటర్ చీఫ్ మేనేజర్ (విజయనగరం) సీహెచ్ సూర్యప్రకాష్ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీపై (సీబీడీసీ) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డిజిటల్ కరెన్సీ వల్ల కలిగే లాభాలు, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ జీవీఎస్ఎస్ఎన్ సన్యాసిరాజు, వీఎస్ఎం శ్రీనివాస్, టి.సాయిప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఏపీని విస్మరిస్తున్నారు'



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

విజయనగరం ఫోర్ట్: కేంద్ర ప్రభుత్వ పెద్దలు కావాలనే ఏపీని విస్మరిస్తున్నారని ఏపీ వెలమ సంక్షేమ సంఘ అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రదీప్‌నగర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బడ్జెట్‌లో రైల్వేజోన్‌కు, పోలవరం ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. ప్రతిసారీ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారన్నారు. సమావేశంలో గంగు మన్మధరావు, పెదిరెడ్ల సత్యం, అమ్మాజీ, నూకిరెడ్డి శివ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడికి యత్నం

విజయనగరం క్రైమ్: ఆస్తి కోసం తనతో పాటు దత్త పుత్రికను చంపేందుకు కుట్ర పన్నుతున్నారని కోరుకొండ గ్రామానికి చెందిన సూర్యకాంతం అనే వృద్ధురాలు శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం సాయంత్రం కర్రలు, రాడ్లతో తన తమ్ముడు, కుటుంబ సభ్యులు తనతో పాటు తన కుమార్తెపై దాడి చేసేందుకు చుట్టుముట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సై గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గజపతినగరం: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు ప్రతీ ఇంటికి వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనను చూసి టీడీపీ తన అనుకూల మీడియా ద్వారా ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. వారి దుష్ప్రచారాలను తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించాలని గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ నాయకులకు సూచించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేశాం కాబట్టే ఈ రోజు ప్రజల మధ్యకు వెళ్లి ధైర్యంగా చెప్పుకోగలుగుతున్నామన్నారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు లంచాలు లేనిదే ఏ పని జరిగేది కాదని, దోచుకోవడం.. దాచుకోవడం తప్ప ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా వారి హయాంలో చేపట్టలేదని ఆరోపించారు.

జిల్లాకు చేరుకున్న సమరయాత్ర



మాట్లాడుతున్న సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం పూల్‌బాగ్: ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు హిందూపూర్ నుంచి ఇచ్ఛాపురం వరకు జరుగుతున్న సమరయాత్ర శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. యాత్రలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టి, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర విభజన జరిగి 9 సంవత్సరాలు పూర్తయినా విభజన హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నాయకులు పి. కామేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి టి. సూర్యనారాయణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. అశోక్, రాష్ట్ర అధ్యక్షుడు కె. ప్రసన్న కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు సీహెచ్ పావని, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు వై. రాము, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి. లెనిన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వెంకటేష్, పి. రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి..

పూసపాటిరేగ: విభజన హామీలు అమలు చేయని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ అన్నారు. సమరయాత్ర ర్యాలీ మండల కేంద్రానికి చేరుకుంది. అనంతరం ఎస్‌వీఎస్ఆర్ కళాశాలలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర విభజన జరిగి 9 సంవత్సరాలు అవుతున్నా ప్రత్యేక హోదా కోసం ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి, యువజన సంఘాలు చేస్తున్న సమరయాత్రతో రాజకీయ నాయకులు కళ్లు తెరవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. అశోక్, ఎస్ఎఫ్ఐ నాయకులు రవికుమార్, ప్రసన్నకుమార్, పావని, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే అభివృద్ధి



ఆలయ ప్రారంభత్సోవంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: ఆధ్యాత్మికత, సేవాతత్పరత నెలకొన్న ప్రాంతం తప్పకుండా అభివృద్ధి చెందుతుందని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని దాసన్నపేట కాపువీధిలో శుక్రవారం చేపట్టిన అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వర, విజయ గణపతి సుబ్రహ్మణ్యేశ్వర నవగ్రహ, కాల భైరవ సహిత చండీశ్వర ఆలయ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా వేద పండితులు ఆమెకు ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజ హితం కోసం చేసే ప్రతి కార్యక్రమానికి తమవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. సేవా మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. పరమశివుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆమె అభిలాషించారు. అందరూ కలసికట్టుగా, భక్తిభావంతో ఆలయాన్ని పునరుద్ధరించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆమె చేతుల మీదుగా 5000 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమెతో పాటు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారు నాయుడు, జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు, కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, బొద్దాన వెంకటలక్ష్మి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు బోడసింగి ఈశ్వరరావు, భోగాపురపు శ్రీనివాసరావు, నేతల సన్యాసిరావు, కందర్ప శ్రీనివాసరావు, రెడ్డి రామ్స్, నడిపేన రమేష్, సంగి శ్రీనివాసరావు, ఆల్తి చిట్టిబాబు, కలపర్తి లక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ రామ చిరంజీవి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేటలో కొండపై నిర్మిస్తున్న దాసాంజనేయ ఆలయ నిర్మాణానికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ గేదెల రామచిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకుడు తర్లాడ దుర్గారావు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఆలయ నిర్మాణంపై టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు భారీ వ్యయంతో ఆలయాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఆలయ నిర్మాణానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు అన్ని పార్టీల నాయకుల సహాయాన్ని కోరామని తెలిపారు. అయితే ఆలయ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే దాతల సహాయంతో సుమారు ఏడు లక్షల రూపాయలతో కొండపైకి రోడ్డు వేయించామని, ఆలయాన్ని కూడా సుందరంగా నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహంతి రామారావు, పతివాడ రామరావు, తర్లాడ రామస్వామినాయుడు , పిన్నింటి సత్యారావు పాల్గొన్నారు.

సంతాపం

విజయనగరం లీగల్: ప్రముఖ సినీ డైరెక్టర్, నటుడు కాశీనాథుని విశ్వనాథ్ మృతిపై స్థానిక న్యాయవాదులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది ఖండాపు ఫల్గుణరావు, కురెళ్ల శ్రీనివాసరావు, పల్లా రవి, అశ్వనికుమార్, కంది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దీప్తికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ తీసుకుంటున్న టి.దీప్తి

విజయనగరం టౌన్: లెప్రసీ మిషన్ ద్వారా కొన్నేళ్లుగా కుష్ఠు వ్యాధిగ్రస్తులకు విశేషమైన సేవలందిస్తున్న తాలాడ దీప్తికి గౌరవ డాక్టరేట్ లభించింది. విశాఖకు చెందిన సెయింట్ పాల్స్ థియోలాజికల్ కళాశాల ద్వారకానగర్ పబ్లిక్ లైబ్రరీలో గురువారం నిర్వహించిన 11వ స్నాతకోత్సవంలో డాక్టరేట్‌ను అందించింది. ఈ సందర్భంగా దీప్తిని పలువురు అభినందించారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న రాయుడు

విజయనగరం ఫోర్ట్: ప్రసవం నిమిత్తం ఆస్పత్రిలో చేరిన ఓ గర్భిణికి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు పట్టణానికి చెందిన ఓ యువకుడు. వివరాల్లోకి వెళితే.. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని సహస్ర ఆస్పత్రిలో కురుపాంనకు చెందిన కేతిరెడ్డి సంధ్య అనే గర్భిణి ప్రసవం కోసం చేరింది. ఆమెకు ఓ నెగిటివ్ గ్రూపు రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించడంతో... కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులను ఆశ్రయించారు. వారి అభ్యర్థన మేరకు సాధన యూత్ క్లబ్ సభ్యుడు కె. రాయుడు స్థానిక రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తందానం చేశాడు. సకాలంలో స్పందించి రక్తదానం చేసినందుకు రాయుడిని రెడ్‌క్రాస్ కోశాధికారి రామారావు, మేనేజర్ వెంకటేష్, గౌరీశంకర్ అభినందించారు.

సామగ్రి కొనుగోలుకు కమిటీ ఆమోదం

విజయనగరం అర్బన్: జిల్లాలోని కేంద్ర గ్రంథాలయం, గ్రామీణ గ్రంథాలయాల నిర్వహణకు అవసరమైన సామాగ్రి కొనుగోలుకు కమిటీ ఆమోదం తెలిపిందని ఆ సంస్థ కార్యదర్శి ఎస్.లలిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫర్నీచర్, జిరాక్స్ మెషీన్లు, ప్రింటింగ్ రిజిస్టర్లు సరఫరా చేయటానికి సరఫరాదారుల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి పది రోజుల పాటు అందుబాటులో ఉన్న 'ఏపీ ఈప్రొక్యూర్‌మెంట్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్ ద్వారా ఈ టెండర్లు దాఖలు చేయాలని సూచించారు.

సఖి గ్రూపులతో బాలికల సాధికారత



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములనాయుడు

- కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: బాలికల సాధికారతకు సఖి గ్రూపులు ఎంతగానో ఉపయోగపడతాయని నగర పాలక సంస్థ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక బీపీఎం పాఠశాలలో బాలికలతో సమావేశం నిర్వహించి, సఖి గ్రూపుల అవసరం, ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సఖి గ్రూపులో 9 నుంచి 21 సంవత్సరాల బాలికలు సభ్యులుగా చేరి సాధికారత దిశగా అడుగులు వేయాలని ఆకాంక్షించారు. సఖి గ్రూపులలో మహిళా ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావడం హర్షించదగ్గ విషయమన్నారు. సచివాలయాల పరిధిలో ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి, ఆరోగ్య సంరక్షణ కార్యదర్శి ఆధ్వర్యంలో సఖి గ్రూపుల నిర్వహణ జరుగుతోందన్నారు. వీరితో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయినులు ఒక గ్రూపుగా ఏర్పడి స్నేహపూర్వక వాతావరణంలో బాలికలతో సత్సంబంధాలను ఏర్పర్చుకోవాలని సూచించారు. ఇలా చేయడం వల్ల బాలికలలో ఏర్పడే ఆరోగ్య సమస్యలు, పౌష్టికాహార జాగ్రత్తలు, లైంగిక వేధింపులు వంటి విషయాలపై సమగ్రంగా చర్చించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా మెలగాలి



గిల్లీ బర్న్‌ను సన్మానిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: క్యాన్సర్ వ్యాధిగ్రస్తులతో స్నేహపూర్వకంగా మెలగాలని క్యాన్సర్ రిలీఫ్ ఇండియా సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ గిల్లి బర్న్ సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ, క్యాన్సర్ రోగుల్లో మానసిక ధైర్యం నింపాలని సూచించారు. అనంతరం వీసీ జీఎస్ఎన్ రాజు ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, డీన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు



అవగాహన సదస్సులో ఎస్ఈబీ సిబ్బంది, విద్యార్థులు

- ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ మధుకుమార్

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు నాశనమవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి. మధుకుమార్ అన్నారు. విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ధర్మపురిలో గల లక్ష్మీగణపతి డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత ఉజ్వల భవిష్యత్‌ను మత్తుపదార్థాలు చిత్తు చేస్తున్నాయన్నారు. వ్యసనాలకు అలవాటుపడితే అనారోగ్య సమస్యలతో పాట ఆర్థిక సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరావు, కానిస్టేబుల్ వెంకటరమణ, అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలను వేలం వేయండి



మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

- ఎస్పీ ఎం.దీపిక



హాజరైన పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సారా, మద్యం అక్రమరవాణాలో పట్టుబడిన వాహనాలను నిబంధనల మేరకు వేలం వేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కళాశాలలు, పాఠశాలలు, యూనివర్సిటీల్లో మత్తు పదార్థాలు వినియోగించే వారి సమాచారాన్ని సేకరించేందుకు సమాచార బాక్సులను ఏర్పాటుచేయాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, లెక్చరర్స్‌తో యాంటీ డ్రగ్ కమిటీలను నియమించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, రవాణా సమాచారాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ నంబర్ 14500ను అందరికీ తెలియజేయాలన్నారు. ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ అస్మ ఫర్హీన్ మాట్లాడుతూ వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, సీజ్ చేసిన వాహనాలను వేలం వేయడంపై సూచనలు ఇచ్చారు. అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, రాజాం, బొబ్బిలి సీఐలు కె.రవికుమార్, ఎం.నాగేశ్వరరావు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డ్రైవర్ల సేవలు ఎనలేనివి

- ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ జోన్–1 డైరెక్టర్ చింత రవికుమార్



మాట్లాడుతున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ జోన్–1 డైరెక్టర్ చింత రవికుమార్



అవార్డులు పొందిన ఆర్టీసీ డ్రైవర్లు

విజయనగరం టౌన్: ఆర్టీసీలో ప్రమాదరహిత సేవలందించిన డ్రైవర్ల సేవలు ఎనలేనివని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ జోన్–1 డైరెక్టర్ చింత రవికుమార్ అన్నారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి భద్రత విషయంలో ఆర్టీసీ డ్రైవర్లు ఎంతో చాకచక్యంగా వ్యవహరిస్తూ ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చుతుండడంలో సఫలీకృతులవుతున్నారన్నారు. అటువంటి వారందరినీ గుర్తించి వారికి ప్రశంసపత్రాలు, నగదు బహుమతి అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం ప్రజా రవాణాధికారులు ఎ.విజయకుమార్, కె.శ్రీనివాసరావు, జి.సుధాకర్, జోన్–1 డిప్యూటీ సీటీఎం కె.వెంకటరావు, డిప్యూటీ సీఎంఈ సీహెచ్. అప్పలనారాయణ, రెండు జిల్లాల డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్లు, యూనియన్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

అవార్డులు పొందిన వారిలో,....

విజయనగరం జిల్లాలో ఏవీఎస్.నారాయణ, ఎల్.శివాజీ, ఐఏ.రావు, ఎస్.కోట డిపో పరిధిలో జేఎస్.నారాయణ, ఎంవీ.రమేష్, సీహెచ్‌జీ రావు, విజయనగరం డిపో పరిధిలో వై.ముత్యాలు, జీవీ రమణ, జి.రాజు, పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో పీసీహెచ్ఎస్.రావు, ఎంఎస్.రావు, జీఆర్.ధనం, సాలూరు డిపో పరిధిలో జి.అరవింద్, జీఈ.రావు, వీఎస్.రావు, పార్వతీపురం డిపో పరిధిలో టీఎస్.రావు, కేఎస్.చలం, పీఏ రావు, పాలకొండ డిపో పరిధిలో ఎన్‌వీ.రావు, ఎంవీ.రాజు, ఎస్ఆర్.రావు ఉన్నారు. ఉద్యోగులను ఆర్టీసీ అధికారులు అభినందించారు.

మినహాయింపు ఇవ్వాలి..



ఆందోళన చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

నెల్లిమర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేస్ రికగ్నేషన్ హాజరు నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని నెల్లిమర్ల నగర పంచాయతీకి చెందిన పారిశుధ్య కార్మికులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. తమలో చాలామంది వద్ద స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం వల్ల ఇబ్బంది ఏర్పడుతోందన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న జనవరి నెల జీతం, హెల్త్ అలవెన్సులు వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం కమిషనర్ బాలాజీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో టౌన్ కార్యదర్శి బి. రమణ, హరిబాబు, సురేష్, లక్ష్మి, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.